# మర్రిచెట్టు

మర్రిచెట్టు కింద మంచం వేసుకొని తాతా మనవడూ కూర్చున్నారు. తాతకో డెబ్బయి ఏళ్ళుండవచ్చు. మనవడు పదేళ్ల వాడు. ఐదో తరగతి చదువుతున్నాడు.

"అయితే తాతా ఈ చెట్టు ఎప్పుడు నాటారో నీకూ తెలీదా?"

"తెలీదురా. చిన్నప్పుడు నేనూ ఇక్కడ ఆట్లాడుకొన్నాను. ఎప్పుడూ చెట్టుమీదనే ఉండేవాణ్ణి. కోతి కొమ్మా ఆడేవాణ్ణి. మా అమ్మ అనేది, రేయ్ ఎప్పుడో కాలో చెయ్యో విరుగుతుంది అని అట్లనే అయింది!"

"ఏమైంది తాతా!"

"ఒకసారి చిటారుకొమ్మదాకా పాక్కుంటూ వెళ్ళి కొమ్మతో పాటు దబుక్కున కింద పడ్డా. ఒక కాలు మొత్తం విరిగింది."

"అయ్యో... అప్పుడు..."

"ఇక్కడేం ఆస్పత్రులులేవు. ఎడ్ల బండ్లో పక్క టౌనుకు వేసుకుపోయారు. దారంతా ఏడ్చి రాగాలు పెట్టూనే ఉన్నా."

"మళ్ళా..."

"ఇప్పుడంత జ్ఞాపకం లేదురా. యాభై అరవై ఏళ్ళనాటి మాట. నాలుగైదు నెలలు కుంటుతూనే ఉన్నాను. కట్లు బెట్టుకొని నడిచేవాడిని."

"నీకెన్నేళ్ళు తాతా?"

"నాకు తెలీదురా. ఎవరైనా జాతకాలు రాసి పెట్టారా ఏం? చదువురానోళ్లం. తేదీలు మా అమ్మకు తెలుసా మా నాయనకు తెలుసా అమ్మ చెప్పేది శ్రీరామనవమి పోయిన వారానికి పుట్టానని."

"కొంచెమైనా అందాజుగా అయినా తెలీదా తాతా?"

"తెలుసురా. పెద్దకరువొచ్చినపుడు నాకు పదేళ్ళు".

ఇది ఐదో తరగతి చదువుతున్న కుర్రాడికి చిక్కయిన లెక్క. రాయలసీమలో ఏది చిన్న కరువో ఏది పెద్దకరువో మహామహులే చెప్పలేరు.

"నువ్వెందుకు చదువుకోలేదు తాతా?"

ముసలాయన నవ్వాడు.

"నీ వయసుకే నేను మడక దున్నేవాడినిరా. చిన్నప్పటినుండి సేద్యం పనులే సరిపోయె. బడికి పొయ్యేదెట్లా?"

"అప్పుడు బడులుండేనా?"

"ఏదో ఆ పెద్దయ్య వారు వీధరుగు మీద ఓనమాలు రాయించేవాడు."

ఆ పెద్దయ్య వారెవరో ఆ వీధి అరుగేదో వీడికి తెలీదు.

"పోనీలే తాతా. నా పలకాబలపం తెచ్చిస్తా. నీకు ఆ అలు నేర్పిస్తా. నేర్చుకుంటావా?"

తాత నవ్వాడు.

"ఏం కష్టం కాదు తాతా. నాకు వచ్చిన చదువంతా నీకు చెపతా".

తాతకు మరీ నవ్వొచ్చింది. నవ్వి, నవ్వి దగ్గసాగాడు.

మట్టి మిద్దెలో నుంచి శాంతమ్మ ఇవతలికి వచ్చింది. "ఏందిరా కిష్టిగా తాతను సతాయిస్తున్నావు. ఇట్లొచ్చి మంచినీళ్లు పట్టుకుపో."

కిష్టిగాడి పేరు రామకృష్ణుడు. వాడు మాట్లాడకుండా లోపలికి వెళ్లాడు నీళ్ళగ్లాసు తీసుకురావడానికి. ఉదయమో, సాయంత్రమో సెలవు రోజుల్లో మధ్యాహ్నమో ఎప్పుడు సమయం దొరికితే అప్పుడు తాతా మనవళ్ళు మర్రి చెట్టు కింద కూర్చుని కబుర్లు చెప్పుకొనేవారు. వాడు తన పుస్తకాల్లోని కథలు, పద్యాలు తాతకు చదివి వినిపించేవాడు. తాత కూడా తనకు తెలిసిన కథలు చెప్పి నవ్విస్తుండేవాడు.

ఒకరోజు క్రింద బడ్డ మర్రికాయలు ఏరుకొని జేబులో పోసుకొని తాత దగ్గర చేరాడు రామకృష్ణుడు. తాత నులక మంచం మీద పడుకొని కళ్ళు మూసుకొని ఉన్నాడు. వీడి చప్పుడుకు కొద్దిగా కదిలి "ఏందిరా తింటున్నావు?" అన్నాడు.

"మర్రికాయలు."

"ఛీ... ఛీ ఎన్నిసార్లు చెప్పినా వినవేమిట్రా. అవి తినేవేనా?"

"ఎర్రగా పండినవి మెత్తగా బాగుంటాయి తాతా. కావాలంటే తినిచూడు. లోపల సన్న గింజలు."

తాత ఏం మాట్లాడలేదు. అసలు మర్రికాయలు తింటే మంచిదో చెడ్డదో కూడా ఆయనకు తెలీదు. "గుడ్డలు కర్రలవుతాయేమో, ఆ కాయలు జేబులో నుంచి తీసెయ్" అన్నాడు చివరకు రామకృష్ణుడు కాయలు జేబులో నుంచి తీసి చేతిలో పోసుకొన్నాడు.

"తాతా..."

"ఊ..."

"మర్రిచెట్టు ఇంత పెద్దది కదా. దాని కాయలింత చిన్నగా ఉంటాయేం?"

"నాకేం తెలుసురా? ఎంత చెట్టుకంత గాలి అన్నారు గానీ ఎంత చెట్టుకంత కాయ అనలేదురా."

"నాకు తెలుసు"

"ఏం తెలుసు?"

"అదే మర్రిచెట్టుకింత చిన్నకాయలెందుకుంటాయో. ఒకసారట. ఒకాయనట ఏదో ఊరికి పోతున్నాడు. నడిచినడిచి పోతున్నాడు. పాపం బాగా అలసిపోయాడు."

"ఈ వదరుబోతు ఎప్పుడూ వదరుతూనే ఉంటాడు." మురిపెంగా కొడుకును తిట్టి ఆ ప్రక్కనే కూర్చుంది శాంతమ్మ బియ్యం చెరుగుతూ.

"ఏందమ్మా నువ్వు. నేను తాతకు కథ చెప్తుంటే."

"మీ అమ్మ మాటలకేంలే. నువ్వు చెప్పరా" అన్నాడు తాత వాడి జుట్టు నిమురుతూ.

"మరేమో తాతా, ఆయన బాగా అలిసిపొయ్యాడు. ఎక్కడైనా కొంచేపు కూచుందామని అట్లా ఇట్లా చూశాడు. ఎదురుగా మర్రిచెట్టు కనిపించింది. దాని కింద పైపంచి పరచి పడుకున్నాడు. పైకి చూస్తే గుత్తులు గుత్తులుగా మర్రికాయలు కనిపించాయి. పక్కన

జూస్తే ఒక గుమ్మడి తీగ కనిపించిది. బరువుగా కాయలు నేలమీద ఉన్నాయి. ఇవి చూసి ఆయన నవ్వాడు.''

"ఎవరూ నవ్వింది?'' అంది శాంతమ్మ.

"పోమ్మా నువ్వు సరిగ్గావినవు. మధ్యమధ్య మాట్లాడిస్తావు.''

"నువ్వు చెప్పరా'' అన్నాడు తాత.

"అదే, ఆయన నవ్వాడు. ఓరి భగవంతుడా ఇంత చెట్టుకు ఇంత చిన్నకాయ, అంత సన్న తీగకు అంత పెద్దకాయ. ఇదేమన్నా బాగుందా అనుకొన్నాడు. ఇటూ అటూ పొర్లి కొంచేపటికి నిద్రబొయ్యాడు...''

అప్పుడే వెంకటేశు తలకున్న తుండుగుడ్డ దులిపి భుజంపైన వేసుకుంటూ వచ్చాడు. తన తండ్రిని, కొడుకును, భార్యను ఒక చూపులో చూసి పక్క నున్న అరుగుమీద కూర్చున్నాడు. "కొంచెం నీళ్ళు తీసుకురా'' అన్నాడు భార్యతో. "ఎప్పుడూ మాటలేనా కిష్టా, చదివేది లేదా'' అన్నాడు కొడుకుతో.

"ఇప్పటి దాకా చదువుతూనే ఉన్నాడురా పాపం. ఇప్పుడే వచ్చాడు'' అన్నాడు తాత.

"మిగిలిన కథ చెప్పేదా?'' అని గుసగుస లాడాడు తాత చెవిలో.

"చెప్పరా'' అన్నాడు తాత పెద్దగానే.

"అప్పుడేమో ఆయన నిద్రబొయ్యాడు. మెలుకువ వచ్చి చూసి చెంపలేసుకొన్నాడు.''

"ఎందుకూ?'' అన్నాడు తాత ఆశ్చర్యంగా.

"ఎందుకంటే తన మీద నాలుగైదు మర్రికాయలు పడి ఉన్నాయి. ఒకవేళ గుమ్మడి కాయలంత కాయలైతే అంతెత్తునుండి పడితే ఆయన బుర్ర బద్దలవదూ? పొట్టపగలదూ? అందుకూ'' కిలకిల నవ్వాడు రామకృష్ణుడు.

"బుద్ధివచ్చింది సామీ, బుద్ధొచ్చింది సామీ అని చెంపలేసుకున్నాడు. నువ్వు పుట్టిచ్చినట్లే బాగుంది నా, బుద్ధిలేని మాటలు పట్టించుకోకు అన్నాడు.''

ఆ రాత్రి భోజనాల సమయంలో వెంకటేశు అన్నాడు "ఈ మర్రి చెట్టు కొట్టించెయ్యాలి''. పెద్దాయనకు పాలకమారింది. రామకృష్ణుడు తింటున్న అన్నం వదిలేసి "ఎందుకూ, ఎందుకూ'' అన్నాడు కీచుగా. పొంగుతున్న పాలు దింపటమే మరచిపోయి భర్తవైపు తిరిగింది శాంతమ్మ.

"ఇంటి ముందున్న ఖాళీ స్థలమంతా ఈ చెట్టే ఐపోయె. అది కొట్టించేస్తే...''

"అది ఏనాటి చెట్టురా. మూడు తరాలకు పైగా ఉంది. ఎవరైనా పచ్చనిచెట్టు కొట్టేస్తారా?" అని మందలించాడు పెద్దాయన కొడుకును.

"కొట్టకపోతే ఎట్ల నాయనా. ఎల్లకాలమూ మట్టి మిద్దె సరిపోతుందా? ఊర్లో చూడు అందరూ ఎంతెంత మంచి ఇండ్లు కడ్తున్నారో. మనమూ కొంచెం ఇటుక సిమెంటుతో ఇల్లు గట్టే నాలుగు కాలాలపాటు ఉంటుంది. ఇంటిముందర గేటూ అది పెట్టుకోవచ్చు. వెనక గొడ్లు కట్టేసుకోవచ్చు."

"ఇపుడు ఈ ఇంటికేమైందిరా?"

"మట్టిమిద్దె ఎన్నాళ్లుంటుంది? ఎంత మట్టి మెత్తినా ఎన్ని సున్నాలు గొట్టినా ఇంక ఇది లాభం లేదు. ఈ పొద్దో రేపో కూలుతుంది. నువ్వే చెప్పావు ఇది మీ తాత కట్టాడని నూరేళ్ళు పైబడిందా లేదా? మనుషుల్లాగే ఇండ్లకూ ఆయుస్సుంటుంది. అన్నీ బాగున్నప్పుడే ఇల్లుకట్టేది మేలు."

ముసలాయన మరి మాట్లాడలేదు. కష్టపడి పనిచేసి సంసారాన్ని లాక్కొచ్చేవాడు కొడుకు. మర్యాదకు తనమాట విన్నా, కాదు కూడదంటే చేసేదేముంది?

రామకృష్ణుడు అన్నం ముందు నుంచి ఎప్పుడులేచి వెళ్లాడో ఎవరూ గమనించలేదు. ఎంగిలి పళ్లాలు కడగటానికి ఇవతలికి వచ్చిన శాంతమ్మ మర్రి చెట్టు దగ్గర ఎవరో మనిషిని చూసింది. "ఎవరక్కడ?" అంది సగం బింకంగా, సగం భయంగా. అప్పడే బయటకు వచ్చిన వెంకటేశు "ఎవర్రా అక్కడ?" అంటూ దగ్గరకు వెళ్ళాడు. రామకృష్ణుడు! చెట్టుకు అతుక్కొని వెక్కిళ్లు పెడ్తున్నాడు.

"ఇంత రాత్రిపూట ఇక్కడేం పనిరా. పురుగూ పుట్రా ఉంటాయి ఇవతలికిరా" అని వాణ్ణి లాక్కొచ్చాడు వెంకటేశు.

ఆ మరుసటి రోజు ఎవరెవరో వచ్చారు. చెట్టు బేరమాడారు. రామకృష్ణుడికి తన దుఃఖాన్ని ఎవరితో పంచుకోవాలో అర్థం కాలేదు.

ఆ మధ్యాహ్నం తాతా, మనవడూ ఉలుకూ పలుకూ లేకుండా చెట్టుకింద నులక మంచం మీద కూర్చున్నారు. రామకృష్ణుడు కొద్దిగా ఒరిగి తాత వొడిలో తలపెడ్తూ "తాతా చెట్లకు ప్రాణం ఉంటుంది కదూ" అన్నాడు.

"అవునురా. లేకపోతే అవెట్లా పెరుగుతాయి" అన్నాడు తాత.

"మరి ఈ చెట్టును కొట్టే దానికి నొప్పవదూ!"

"నాకు తెలీదురా" ఆయన గొంతు పూడుకుపోయింది.

"నాకు తెలుసు. నేను చదివాను. జగదీశ చంద్రబోసు అనే ఆయన చెట్లకు ప్రాణం ఉందని చెప్పాడు. వాటికీ నొప్పవుతుంది. ఇంకా మా టీచరేం చెప్పారో తెలుసా? చెట్లను కొట్టేస్తే మనకే అపకారమట. వాటిని ప్రేమగా చూసుకుంటే..."

"ఒరే కిష్టిగా ఆ వాగుడొదిలి ఇటురా" లోపల నుండి శాంతమ్మ కోపంగా పిలిచింది.

కిష్టిగాడు పోలేదు. "తాతా మన చెట్టు మీద పిట్టలున్నాయే అవెక్కడికి పోతాయి పాపం..."

శాంతమ్మ కర్రపట్టుకొని వచ్చింది. "లేస్తావా నాలుగివ్వనా? వెళ్ళి ఆ లేగదూడకు నీళ్ళు పెట్టు."

రామకృష్ణుడు కాళ్ళీడ్చుకుంటూ నెమ్మదిగా నీళ్ళ తొట్టివైపు కదిలాడు. రేపు చెట్టు కొట్టేస్తారనగా ఆ రాత్రంతా వాన కురిసింది. ఉరుములు, మెరుపులు, గాలి ఉధృతంగా ఉన్నాయి. ఆ రాత్రి పడుకోబోయే ముందుక వెంకటేశు గొణుక్కోసాగాడు. "ఈ వానా గాలీ చూస్తుంటే ఈ రాత్రికి మనిల్లు నిల్చేటట్టులేదు. నిరుడే చెట్టుకొట్టి ఇల్లు కడ్దామంటి. కానీ నాయన పడనిస్తేగదా." వాళ్ళ నాయన అన్ని మాటలూ వింటూనే ఉన్నాడు కానీ ఏం మాట్లాడలేదు.

వానకురుస్తూనే ఉంది. రామకృష్ణుడు ఏడ్చి ఏడ్చి నిద్రకొరిగాడు. అర్ధరాత్రి పిడుగుపడిన శబ్దానికి ఇంటిల్లిపాది అదిరిపోయారు. వెంకటేశుకు ఒకే దిగులు ఇల్లెక్కడ కూలుతుందో అని.

తెల్లవారిన తర్వాత వాన కొంచెం తెరిపి ఇచ్చాక తలుపుతెరచుకొని ఇవతలికి వచ్చిన శాంతమ్మ "అయ్యో" అని అక్కడే కూలబడి పోయింది. ఆమె అరుపుకు వెంకటేశు, అతని తండ్రి ఇద్దరూ బయటకు వచ్చారు. ముసలాయనకు నోటమాటరాలేదు. ఎదురుగా మర్రిచెట్టు కాలిమోడై ఉంది.

"ఇదేందినాయనా" అన్నాడు వెంకటేశు తేరుకొంటూ.

"ఒరే వెంకటేశా ఈ చెట్టు మన తల్లి రా తల్లి. అంత పిడుగూ తననెత్తిన వేసుకొని కాలిమసై పోయింది. మనల్ని కాపాడింది. లేకపోతే మనం..." మాట పూర్తి చెయ్యలేక పోయాడు.

వెంకటేశు తల వంచుకొని చెట్టు దగ్గరకు కదిలాడు. రామకృష్ణుడు ఇంకా నిద్రలో ఉన్నాడు. వాడి బుగ్గలపై కన్నీటి చారికలు ఎండిపోయి ఉన్నాయి.

*(17 సెప్టెంబరు 1989)*